క్లుప్తంగా

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

నల్లగొండ టౌన్: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

నకిరేకల్ : కాంగ్రెస్ నేత దైద రవీందర్ తనను నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎండీ.యూసఫ్‌కు రూ.50 వేల ఆర్థిక సహాయం చేసి మానవత్వం చాటుకున్నారు. యూసఫ్‌కు కంటి సమస్య రాగా.. చెన్నైలోని శంకర్ నేత్రాలయంలో ఆపరేషన్ చేయించుకుంటానని దైద రవీందర్‌కు తెలిపాడు. దీంతో దైద రవీందర్ రూ.50 వేలు అందించి ఆపరేషన్ చేయించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చండూరు(గట్టుప్పల్) : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో గట్టుప్పల్ మండలంలో పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గట్టుప్పల్‌లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నామని జగన్నాథం అందజేశారు. గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన మాదగాని బుచ్చయ్యకు రూ.60 వేలు, భీమగాని రవికి రూ.26,000, రామేశ్వరికి రూ.6000 వేల విలువ గల సీఎం సహాయనిధి చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భీమగాని మల్లేశం, శంకర్, గణేశ్ పాల్గొన్నారు.

శాంతమ్మకు నివాళి

నకిరేకల్ : స్థానిక వైద్యుడు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ డాక్టర్ మోహన్‌రెడ్డి సతీమణి శాంతమ్మకు ఇటీవల మృతి చెందారు. మంగళవారం శాంతమ్మ చిత్రపటానికి లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ జిల్లాల మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ హనుమాండ్ల రాజిరెడ్డి, మల్టీపుల్ ఫాస్ట్ చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి, జిల్లా గవర్నర్ ప్రభాకర్‌రెడ్డి క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బోధనలో మెళకువలు పాటించండి



మాట్లాడుతున్న ఎంఈఓ అరుంధతి

తిప్పర్తి : విద్యా బోధనలో మెళకువలు పాటించాలని మండల విద్యాధికారి కత్తుల అరుంధతి అన్నారు. తిప్పర్తి ఎమ్మార్సీ భవనంలో మంగళవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపు కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సులువుగా విద్య అర్థమయ్యే పద్ధతిలో విద్యార్థులకు బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధ్యానోపాధ్యాయులు నర్సింహనాయక్, వీరాచారి, శ్రీనివాస్, వెంకయ్య, ఆవనిజ తదితరులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి

కట్టంగూర్ : హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 31, సెప్టెంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించే ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు బూరుగు లక్ష్మి పిలుపునిచ్చారు. కట్టంగూర్ మండలంలోని ఈదులూరు గ్రామంలో మంగళవారం కామ్రేడ్ బూరుగు అంజన్న విజ్ఞాన కేంద్రంలో మహాసభ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పి ఉపేంద్ర, మణెమ్మ, సూరమ్మ, సురేఖ, మాధవి, పల్లవి, రత్తమ్మ పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

శాలిగౌరారం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి అన్నారు. శాలిగౌరారం మండలంలోని మాధారంకలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించి పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని, పిచ్చి మొక్కలను సిబ్బందితో తొలగింపజేశారు. అనంతరం గ్రామంలో జరిగిన వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ పద్మ, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

చిట్యాల: పట్టణంలోని భవిత విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలకరించారు. భవిత ప్రత్యేక ఉపాధ్యాయులు బోయ శ్రీనివాసులు, ఆవుల గీత, శృతి, వరలక్ష్మీ, సరిత, ప్రవళిక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు

ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభం

- చిట్యాలలో రూ.45 కోట్ల నిధులతో 800 మీటర్ల పొడవు నిర్మాణం
- సర్వీసు రోడ్లపై డబ్బాలు, డ్రెయినేజీ తొలగింపు
- ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్న అధికారులు



సర్వీస్ రోడ్డులో జేసీబీతో డ్రైయినేజీని తొలగిస్తున్న అధికారులు



సర్వీస్ రోడ్డులో ఓ దుకాణానికి వేసిన మార్కింగ్

చిట్యాల: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు రూ.45 కోట్ల నిధులతో 800 మీటర్ల పొడవున చిట్యాల పట్టణంలో నిర్మించనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ఇప్పటికే జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డులోని తోపుడు బండ్లు, పండ్ల వ్యాపారుల స్థలాలను ఖాళీ చేయాలని అధికారులు సూచించారు. అంతేకాకుండా సర్వీస్ రోడ్డులో పలు దుకాణాల ఎదుట ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను తొలగించాలని, సర్వీస్ రోడ్డు పక్కన డ్రెయినేజీల స్లాబ్‌లపై ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలని సూచించారు. ఇప్పటికే పలువురు దుకాణదారులు తమ దుకాణాల ముందు ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను తొలగించుకోగా, పలువురు డబ్బాలను మరోచోటుకు తరలించారు. కాగా జాతీయ రహదారికి సర్వీస్ రోడ్డు మధ్యన వర్షపు నీటితోపాటు మురుగు వెళ్లేందుకు గతంలో నిర్మించిన డ్రెయినేజీలను జేసీబీల సహాయంతో తొలగిస్తున్నారు. ఇప్పటికే భువనగిరి రోడ్డు నుంచి నార్కట్‌పల్లి వైపు వెళ్లే రోడ్డు(దక్షిణ సర్వీస్ రోడ్డు)లోని డ్రెయినేజీలను వారం రోజుల క్రితం తొలగించారు. నార్కట్‌పల్లి నుంచి చిట్యాల వైపు (ఉత్తర సర్వీస్ రోడ్డు)రోడ్డులోని డ్రెయినేజీలను జేసీబీలతో తొలగించే పనులను మంగళవారం ప్రారంభించారు. అంతేకాకుండా 65 నంబర్ జాతీయ రహదారి మధ్య నుంచి వంద ఫీట్ల మేరకు, సర్వీస్ రోడ్డులో విద్యుత్ స్తంభాల కంటే ముందుకు వచ్చి నిర్మించిన దుకాణాలు, ఇళ్లను తొలగించాలని వారం రోజుల క్రితమే మార్కింగ్ చేశారు. ఈ మేరకు ఆయా ఆస్తుల యజమానులకు తగిన సూచనలను సైతం అధికారులు చేశారు.

రాకపోకలకు ఇబ్బందులు లేకుండా..

చిట్యాల పట్టణంలో 65 నంబర్ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కానుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. పోలీసులతోపాటు నేషనల్ హైవే అథారిటీ అధికారులు సమన్వయంతో ట్రాఫిక్ సమస్యలు రాకుండా వాహనదారులకు, పట్టణవాసులకు తగిన సూచనలు చేశారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్దనే సర్వీస్ రోడ్డులోకి మళ్లించి పోలీస్ స్టేషన్, ఎస్‌బీఐ ముందు గల దక్షిణ సర్వీస్ రోడ్డు మీదుగా జాతీయ రహదారిపైకి మళ్లించే ఏర్పాట్లు చేశారు. నార్కట్‌పల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను ఉత్తర సర్వీస్ రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచి భవాని హోటల్ మీదుగా జాతీయ రహదారిపైకి మళ్లించే ఏర్పాట్లు చేశారు. నార్కట్‌పల్లి నుంచి భువనగిరి వైపు వెళ్లే వాహనాలు ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు వెళ్లి భువనగిరి రోడ్డులోకి వెళ్లాల్సి ఉంటుంది. జాతీయ రహదారికి ఇరువైపులా గల సర్వీస్ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు.

వాహనదారులు సహకరించాలి



చిట్యాల పట్టణంలో ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే సర్వీస్ రోడ్డులో ముందుకు వచ్చి నిర్మించిన దుకాణదారులు, చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని ఖాళీ చేయాలని సూచనలు చేశాం. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు పట్టణ ప్రజలతో పాటు వాహనదారులు సహకరించాలి.

–ఎస్.ధర్మా, ఎస్ఐ, చిట్యాల

నష్టపరిహారం చెల్లించాలని ధర్నా

నల్లగొండ రూరల్: నకిరేకల్–నల్లగొండ–నాగార్జున సాగర్ జాతీయ రహదారి 565పై నల్లగొండ మండలంలోని చిన్నసూరారం గ్రామస్తులు మంగళవారం ధర్నా నిర్వహించారు. రోడ్డు విస్తరణలో నివాసాలు, భూములు కోల్పోయిన 38 మంది బాధితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తు ధర్నా చేపట్టారు. అనేకమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 38 మందికి కోటి రూపాయల నష్టపరిహారం రావాల్సి ఉందని, పరిహారం చెల్లింపులో హైవే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నష్టపరిహారం చెల్లించకపోతే కలెక్టరేట్ వద్ద వంటా వార్పుతో నిరసన చేపడతామన్నారు. మంత్రి, కలెక్టర్ తక్షణమే స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో మాజీ సర్పంచ్ నారబోయిన నర్సింహగౌడ్, సైదులుగౌడ్, యాదయ్య, పూలమ్మ, మంగమ్మ, వెంకన్న, నాగయ్య, సైదులు, యాదగిరి, నవీన్, చంద్రయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న చిన్న సూరారం గ్రామస్తులు

నేడు నిరసన దీక్ష

నల్లగొండ: విద్యా శాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ బుధవారం నల్లగొండలో ర్యాలీ, నిరసన దీక్ష నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని డీఈఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాలనీలో కొనసాగుతున్న వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నకిరేకల్ : మున్సిపాలిటీలో మూసీ రోడ్డు పద్మశాలీ కాలనీలో పక్షం రోజులుగా విషజ్వరాల ప్రబలుతున్న నేపథ్యంలో ఇంటింటికీ జ్వర పీడితులే.. అనే శీర్షికతో సోమవారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు, మున్సిపల్ అధికార యంత్రాంగం కదిలింది. రెండు రోజులుగా కాలనీలో క్యాంప్ ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ బాలయ్య ఆధ్వర్యంలో కాలనీలో సిబ్బంది పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టారు. మున్సిపల్ సిబ్బంది కాలనీలో వీధుల వెంట పిచ్చి మొక్కలను తొలగించారు. మురుగు కాల్వల్లో పేరుకుపోయిన పూడిక తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. బైటాక్స్ మందు పిచికారీ చేయించారు. రెండో రోజు కూడా కాలనీ ప్రజలకు ఓగోడు వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. 28 మందిని పరీక్షించగా అందులో ఆరుగురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. మరో 14 మంది రక్త నమూనాలు సేకరించి నల్లగొండ ల్యాబ్‌కు పంపించారు. వార్డు కౌన్సిలర్ రాచకొండ సునీల్‌గౌడ్, మండల వైద్యాధికారులు డాక్టర్ యోగస్వీ, దివ్య, ఆరోగ్య సూపర్‌వైజర్ వి.నర్సింహాచారి, మలేరియా యూనిట్ అధికారి యాసారపు రామకృష్ణ, ఏఎన్ఎంలు బి.విజయ, ఆశా కార్యకర్తలు రమాదేవి, పద్మ, నాగమణిలు పాల్గొన్నారు.

అభ్యసనను శ్రద్ధగా పరిశీలించాలి

నల్లగొండ : ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసన అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు శ్రద్ధగా పరిశీలించాలని డీఈఓ భిక్షపతి సూచించారు. నల్లగొండలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న లిప్ కార్యక్రమాల నిర్వహణ తీరును మంగళవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. అభ్యాసన అభివృద్ధే లక్ష్యమని, విద్యార్థి విద్యా సామర్థ్యాల పెంపునకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్)ను ప్రధానోపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మండల, క్లస్టర్ నోడల్ అధికారులు వారంలో రెండురోజులు పాఠశాలలను సందర్శించి లిప్‌పై మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు, మానిటరింగ్ అధికారులు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో లిప్‌కు సంబంధించి పర్యవేక్షణ అంశాలను పొందుపరచాలని సూచించారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు త్వరలో శిక్షణ ఇస్తామన్నారు.



లిప్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



నార్కట్‌పల్లి : బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



చిట్యాల : బోనాలతో విద్యార్థినులు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణ కులస్తులు మంగళవారం ఎల్లమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బోనంలో వండిన నైవేద్యాన్ని, పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పాఠశాలలో బోనాల వేడుకలు

చిట్యాల: ఉరుమడ్ల గ్రామంలోని ప్రగతి సాయి విద్యానికేతన్ పాఠశాలలో మంగళవారం బోనాల వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు పోతరాజుల అలంకరణలో అలరించారు. స్కూల్ కరస్పాండెంట్ గుత్తా మహేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పంతంగి నర్సింహ, శేఖర్, జనార్దన్, హంసశ్రీ, నిర్మల, ధనమ్మ, నాగమణి, శిల్ప, రాజేశ్వరి, ఉషశ్రీ పాల్గొన్నారు.

సరదా సరదాగా..



నిత్యం బిజీగా ఉండే నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మంగళవారం సాయంత్రం సరదాగా తన ఇంటి సమీపంలో ఉన్న నకిరేకల్ పెద్ద చెరువు కట్టపై యువకులతో కలిసి చేపలకు గాలం వేశారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. – నకిరేకల్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



వార్డెన్లతో సమీక్ష నిర్వహిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశించారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో నకిరేకల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల వార్డెన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల వార్డెన్లు పాల్గొన్నారు. అనంతరం నకిరేకల్ మున్సిపాలిటీలోని 16వ వార్డుకు చెందిన అనుముల పద్మకు మంజూరైన రూ.2 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిక

కేతేపల్లి మండలం గుడివాడకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు మంగళవారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో ఆలకుంట్ల సైదులు, ఆలకుంట్ల కిష్టయ్య, చంద్రయ్య, పుల్లయ్య, అంజయ్య, వెంకన్న, యాదయ్య, బాబురావు, లింగయ్య, సిద్ధు, మధు, సైదులు, నర్సయ్యతోపాటు మరో 30 మంది ఉన్నారు.

నల్లగొండను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న పాలకవర్గ సభ్యులు

- నీలగిరి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం నీలగిరి మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన పాలక వర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో నల్లగొండను రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. అన్ని వార్డుల్లోని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో మాదిరిగా హైడ్రా తీసుకొచ్చి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న చెరువుల ఆక్రమణలను తొలగించాలని కోరారు. నాలాలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలపై చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, కౌన్సిలర్ ఖయ్యూంబేగ్ మాట్లాడుతూ పానగల్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రాంతంలో 15 ఏళ్ల కిందట మురుగు కాల్వల నిర్మాణం కోసం సేకరించిన స్థలానికి ఇప్పుడు మున్సిపాలిటీ నుంచి నిధులు కేటాయించడం భారంగా మారుతోందన్నారు. కౌన్సిలర్ ఊట్కూరి నారాయణరెడ్డి మాట్లాడుతూ మర్రిగూడలో గ్రామ కంఠం భూములు ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని కోరారు. అనంతరం చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భూ పరిహారం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానన్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తామన్నారు. మౌలిక సదుపాయాల కోసం వార్డుకు రూ.50 వేల చొప్పున కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్, ఈఈ రాములు, అధికారులు, వార్డు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

నాంపల్లి : మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. నాంపల్లి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సమాఖ్య జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పశువులు, కోళ్లు, డ్రోన్ పలు రకాల వ్యాపారాల్లో మహిళలకు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా 100 శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత గ్రామ ప్రజలందరిపై ఉందన్నారు. ఫాం పాండ్, ఇంకుడు గుంతలు నిర్మించినట్లయితే వర్షం నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ముందుగా ఎంపీడీఓ కార్యాలయంలో శేఖర్‌రెడ్డి మొక్కలు నాటారు. మండలంలో ఉపాధిహామీ పనులపై సమీక్ష జరిపారు. ఆయా కార్యక్రమాల్లోఎంపీడీఓ మేరీ స్వర్ణకుమారి, ఎంపీఓ ఝాన్సీ, ఏపీఓ వెంకటేశం, ఏపీఎం వినోద్‌కుమార్, సీసీలు, టీఏలు, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవచేయడమే లక్ష్యం

శాలిగౌరారం: పేద ప్రజలకు సేవలందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని లయన్స్ క్లబ్ రాష్ట్ర మల్టిపుల్ కౌన్సిల్ ఫాస్ట్ చైర్మన్ తీగల మోహనరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ క్లబ్ నేతృత్వంలో యానాల శకుంతల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత కంటివైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పీహెచ్‌సీలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు జోన్ చైర్మన్ ఉప్పల వెంకటరమణ తన తండ్రి బాలనర్సయ్య జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీకి ఈసీజీ మిషన్ అందజేశారు. రోడ్లపై చిరువ్యాపారులకు గొడుగులు అందజేశారు. మండల వైద్యాధికారి సూర్యశిల్ప, కేవి ప్రసాద్, దుబ్బాక వెంకట్‌రెడ్డి, రీజన్ చైర్మన్ గుడిపూడి వెంకటేశ్వరరావు, కంటి హాస్పిటల్ ఆర్గనైజర్ ఉప్పల రాజేంద్రప్రసాద్, స్థానిక అధ్యక్షుడు డెంకెల సత్యనారాయణ, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



గొడుగులు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

స్త్రీ పురుషులిద్దరూ సమానమే

రామగిరి(నల్లగొండ): స్త్రీ పురుషులిద్దరినీ సమానంగా చూడాలని ఎంజీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ వై.ప్రశాంతి, మైక్రో బయాలజీ ఇన్‌చార్జ్ డాక్టర్ కె.మాధురి అన్నారు. నల్లగొండ ఎన్జీ కాలేజీలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ మహిళా సమానత్వం దినోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఉపాధి, పని, వేతనంతో సహా అన్ని రంగాల్లో స్త్రీ పురుషుల మధ్య సమానత్వం తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పరంగి రవి, మహిళా సాధికారికత ఇన్‌చార్జ్ డాక్టర్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు శివరాణి, సరిత, మహేశ్వరి, స్రవంతి, శిరీష, సావిత్రి, డాక్టర్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

‘బెల్టు’ తీస్తున్న పోలీసులు

- చండూరు పోలీస్ సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 38 మందిపై కేసు
- తహసీల్దార్ ఎదుట పలువురి బైండోవర్
- గ్రామాల్లో తగ్గిన ఉద్రిక్తతలు
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు



బెల్టు దుకాణాల నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న మునుగోడు ఎస్ఐ (ఫైల్)

మునుగోడు: గ్రామాల్లో బెల్టు దుకాణాలు కొనసాగించేవారిపై మునుగోడు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. బెల్టు దుకాణాల ద్వారా ఎవరైనా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే చాలు.. కేసులు నమోదు చేస్తున్నారు. పలువురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నారు. దీంతో మునుగోడు మండల వ్యాప్తంగా బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు తగ్గిపోయాయి.

గతంలో గ్రామానికి దాదాపు 10 బెల్టు దుకాణాలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు వైన్స్ షాపుల ద్వారా మాత్రమే మద్యం విక్రయాలు కొనసాగించాలి. కానీ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రతి గ్రామంలో గతంలో నాలుగైదు నుంచి దాదాపు 10కి పైగా బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా కొనసాగాయి. ఇందుకు ప్రధాన కారణం గత ప్రభుత్వం ఆదాయం పెంచుకునేందుకు మద్యం దుకాణాలతోపాటు, బెల్టు దుకాణాల ద్వారా మద్యం విచ్చలవిడిగా కొసాగించేందుకు అనుమతి ఇచ్చిందని ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎవరైనా అధికారులు బెల్టు దుకాణాలను మూసివేయించాలని ప్రయత్నించినా చూసీ చూడనట్లు ఉండాలని సంబంధిత ఉన్నతాధికారులు ఆదేశించేవారని ఆరోపణలు ఉన్నాయి.

గత డిసెంబర్ వరకు జోరుగా దందా..

బెల్టు దుకాణాల వ్యాపారం గత ఏడాది డిసెంబర్ మాసం వరకు మునుగోడులో మూడు పువ్వులు, ఆరు కాయల్లాగా కొనసాగింది. ఎన్నికల సమయంలో తప్ప మిగతా సమయంలో ప్రతి గ్రామంలో బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా కొనసాగేవి. దీంతో అనేక మంది పెద్దలు, యువకులు మద్యానికి బానిసలై ఏ పనిచేయకుండా నిత్యం తాగుతూ ఇళ్లలోనే ఉండేవారు. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పడిపోయి కాంగ్రెస్ పార్టీకి చెందిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే గ్రామాల్లోని బెల్టు దుకాణాలను పూర్తిగా మూసివేయించాలని ఇటూ ప్రజలకు, అటూ అధికారులకు సూచించారు.

38 మందిపై కేసులు.

స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు గత జనవరి మాసం నుంచి గ్రామాల్లో బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించి మద్యం సీజ్ చేయడంతోపాటు అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేశారు. అలా చండూరు పోలీస్ సర్కిల్ పరిధిలో గల మునుగోడు, చండూరు, గట్టుప్పల్ మండలాల్లో ఇప్పటి వరకు 38 మందిపై కేసులు నమోదు చేశారు. అందులో అత్యధికంగా మునుగోడు మండలంలో 30 మందిపై కేసులు నమోదు కాగా చండూరు, గట్టుప్పల్ మండలాల్లో కలిపి 8 మందిపై కేసులు నమోదు చేశారు. అంతే కాకుండా గతంలో బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు కొనసాగించిన వారిని పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మునుగోడు మండలంలో దాదాపు 98 మందిని బైండోవర్ చేయగా.. చండూరు, గట్టుప్పల్ మండలాల్లో 3 మందిని బైండోవర్ చేశారు. ఎవరైనా తిరిగి మద్యం విక్రయిస్తే రూ.2 లక్షల జరిమానాతోపాటు కేసు నమోదు చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. దీంతో గ్రామాల్లో మద్యం విక్రయాలు దాదాపు 80 శాతంకు పైగా నిలిచిపోయాయి. మరికొంత మంది వ్యాపారులు పోలీసుల కంటపడకుండా రహస్య ప్రదేశాల్లో మద్యం నిల్వచేసి అవసరమైన వారికి ఇంటికి తీసుకెళ్లి మద్యం విక్రయించి ఆదాయం పొందుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

తగ్గిన గొడవలు..

గతంలో బెల్టు దుకాణాల్లో మద్యం సేవించి చిన్నాచితకా విషయాలకు నిత్యం తగవులు పడేవారు. కొందరు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకుని స్టేషన్ చుట్టూ తిరుగుతూ తమ సమయాన్ని వృథా చేసుకునేవారు. ఒక్కోమారు చిన్నచిన్న తగువులు పెద్దవిగా మారి హత్యలు చేసుకునేంత వరకు కూడా దారి తీసేవి. కానీ ఇప్పుడు అలాంటి తగువులు చాలావరకు తగ్గిపోయినట్లు పలువురు చెబుతున్నారు. చాలామంది పనులు చేసుకుంటూ కుటుంబ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నారు. వచ్చిన కూలీ డబ్బుల్లో సగానికిపైగా మద్యానికి తమ భర్తలు ఖర్చు చేసేవారని, బెల్టు దుకాణాలు మూసివేయడంతో ఆ నగదు అంతా ఆదా అవుతోందని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే నిర్ణయం హర్షణీయం



గ్రామాల్లో బెల్టు దుకాణాలను మూసివేయించేందుకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయం. గతంలో బెల్టు దుకాణాల వల్ల గ్రామాల్లో అనేక తగువులు జరిగేవి. బెల్టు దుకాణాలు మూసివేయించడంతో తగువులు తగ్గడంతోపాటు పేదరిక నిర్మూలన జరుగుతోంది.

–నారబోయిన స్వరూపరాణి, మాజీ జెడ్పీటీసీ, మునుగోడు

ప్రతిఒక్కరూ సహకరించాలి



గ్రామాల్లో మద్యపాన నిషేధం అమలుకు ప్రతిఒక్కరూ సహకరించాలి. గ్రామాల్లో బెల్టు దుకాణాలు ఉండడం వల్ల యువత మద్యాని బానిసై అనేక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. బెల్టు దుకాణాలను పూర్తిగా మూసివేయించేందుకు నిరంతరం దాడులు నిర్వహిస్తున్నాం.

–వెంకటయ్య, సీఐ, చండూరు